# ఆకాంక్షిత జిల్లాల కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాల ముందంజ

దేశంలో అత్యంత వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి నీతిఆయోగ్ ప్రారంభించిన ఆకాంక్షిత జిల్లాల కార్యక్రమం సత్ఫలితాలిస్తోంది. ఒకరిని చూసి ఒకరు అభివృద్ధి చెందేందుకు వీలుగా పెట్టిన ఈ పోటీలో ఆంధ్రప్రదేశ్‌లోని 3 జిల్లాలు, తెలంగాణలోని 2 జిల్లాలు మంచి ముందడుగు వేశాయి. ఈ ఆర్థిక సంవత్సరం తొలి రెండు నెలల్లో జిల్లాలు స్వయంగా సమర్పించిన సమాచారం ఆధారంగా వాటి పురోగతిని లెక్కించి నీతిఆయోగ్ 2018 జూన్ 29న కొత్తగా 108 జిల్లాలకు డెల్టా ర్యాంకులు విడుదల చేసింది.

- ఆరోగ్యం-పౌష్టికాహారం, విద్య, వ్యవసాయం-జలవనరులు, ఆర్థిక సమ్మిళితం-నైపుణ్యాభివృద్ధి-మౌలికవసతులు అనే 5 రంగాల్లో అభివృద్ధి ఆధారంగా ర్యాంకులు కేటాయించినట్లు నీతి ఆయోగ్ సీఈవో అమితాబ్‌కాంత్ పేర్కొన్నారు.
- ఈ రెండు నెలల్లో సాధించిన రాష్ట్రాల పురోగతిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. జిల్లాలవారీగా చూస్తే గుజరాత్‌లోని దహోద్ మొదటి స్థానంలో, పశ్చిమ సిక్కిం, రామనాథపురం(తమిళనాడు) తరువాతి స్థానాల్లో నిలిచాయి.
- జమ్మూకశ్మీరులోని కుప్వారా, బిహార్‌లోని బెగుసరై, ఝార్ఖండ్‌లోని రాంచి దేశంలోనే వరుసగా అథమ స్థానాల్లో నిలిచాయి.
- రెండు నెలల్లో బాగా పురోగతి సాధించిన జిల్లాల్లో ఏపీకి చెందిన విజయనగరం 4, కడప 5, విశాఖపట్నం 14 ర్యాంకులో నిలిచాయి. తెలంగాణ నుంచి ఖమ్మం 11, ఆసిఫాబాద్ 15వ ర్యాంకు చేజిక్కించుకున్నాయి.
- పురోగతి చూపని జిల్లాల్లో ఉత్తరప్రదేశ్, బిహార్, జార్ఖండ్,ఒడిశాలకు చెందినవే అత్యధికం ఉన్నాయి. విజయనగరం, కడప, విశాఖజిల్లాలు విద్యాపరంగా మంచి పనితీరుతో 1, 4, 5 ర్యాంకులు సాధించాయి. 'వ్యవసాయ విభాగం'లో సాధించిన పురోగతిలో ఖమ్మం జిల్లా 5వ ర్యాంకు చేజిక్కించుకొంది.
- 'ఆర్థిక సమ్మిళిత పురోగతి'లో విశాఖపట్నం జిల్లా 2వ ర్యాంకు, భూపాలపల్లి జిల్లా 5వ ర్యాంకులో నిలిచాయి.
- అన్ని విభాగాలూ కలిపి చూస్తే 17.5% మార్కులతో విజయనగరం 4వ ర్యాంకు, 14.9%మార్కులతో కడప 5వ ర్యాంకు, 11% మార్కులతో విశాఖపట్నం 14వ ర్యాంకు సాధించాయి.
- తెలంగాణలో 11.8% మార్కులతో ఖమ్మం 11వ ర్యాంకు, 10.8% మార్కులతో ఆసిఫాబాద్ 15వ ర్యాంకు, 8.9% మార్కులతో భూపాలపల్లి 22వ ర్యాంకులో నిలిచాయి. బేస్‌లైన్ ర్యాంకింగ్‌లో 100వ స్థానంలో నిలిచిన ఆసిఫాబాద్ జిల్లా మంచి పనితీరు కనబరిచి 15వ ర్యాంకుకు చేరుకుంది.
- బేస్‌లైన్ ర్యాంకింగ్‌లో మొదటి స్థానంలో నిలిచిన విజయనగరంజిల్లా గత రెండు నెలల్లో సాధించిన పురోగతిలో 4వ స్థానాన్ని ఆక్రమించింది. ఇదివరకు 4వ స్థానంలో ఉన్న కడప ఇప్పుడు 5వ స్థానం, 13వ స్థానంలో ఉన్న విశాఖపట్నం 14వ స్థానంలో నిలిచాయి.
- బేస్‌లైన్ ర్యాంకింగ్‌లో 10వ స్థానంలో ఉన్న ఖమ్మం జిల్లా ఇప్పుడు 11వ స్థానం, 20వ స్థానంలో ఉన్న భూపాలపల్లి జిల్లా 22వ స్థానం, 100వ స్థానంలో ఉన్న ఆసిఫాబాద్ జిల్లా 15వ స్థానంలో నిలిచాయి.

## సూర్యుడికి అత్యంత చేరువగా వెళ్లనున్న 'పార్కర్ సోలార్ ప్రోబ్' : నాసా

సూర్యుడి గురించి మరింత లోతుగా తెలుసుకోవడానికి అమెరికా రూపొందించిన 'పార్కర్ సోలార్ ప్రోబ్' వ్యోమనౌకను 2018 ఆగస్టు 6న ప్రయోగించనున్నట్లు అమెరికా అంతరిక్ష సంస్థ (నాసా) ప్రకటించింది. ఫ్లోరిడాలోని కెన్నెడీ అంతరిక్ష కేంద్రం నుంచి ఈ ప్రయోగం జరుగుతుంది. ఇది సూర్యుడికి 6.1 మిలియన్ కిలోమీటర్ల దూరంలోకి వెళుతుంది. మానవనిర్మిత వస్తువు ఒకటి సూర్యుడికి అంత చేరువగా వెళ్లడం ఇదే మొదటిసారి. సూర్యుడి పరిమాణం, ఇప్పటివరకూ సూర్యుడికి అత్యంత చేరువగా వెళ్లిన వ్యోమనౌక హీలియోస్-2. అది సూర్యుడికి 43.4 మిలియన్ కిలోమీటర్ల దూరంలోకి వెళ్లింది. ప్రఖ్యాత ఖగోళ భౌతిక శాస్త్రవేత్త యుజీన్ పార్కర్ పేరును ఈ వ్యోమనౌకకు పెట్టారు. జీవించి ఉన్న ఒక వ్యక్తి పేరును వ్యోమనౌకకు పెట్టడం ఇదే మొదటిసారి. సూర్యుడి బాహ్య వాతావరణ వలయమైన కరోనా దగ్గరకు అది వెళుతుంది. సౌర వాయువులు, జ్వాలల వల్ల భూమిపై విద్యుత్ గ్రిడ్లు దెబ్బతినడం, కమ్యూనికేషన్ సాధనాలు మొరాయించడం జరుగుతుంది. ఈ నేపథ్యంలో సూర్యుడి కరోనా, అయస్కాంత క్షేత్రం, సౌర జ్వాలలు, వాయువుల గురించి మరింత అవగాహనకు పార్కర్ సోలార్ ప్రోబ్ దోహదపడుతుందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. దీనివల్ల భూమికి చేరువలోని అంతరిక్ష వాతావరణంలో మార్పులను ముందుగానే తెలుసుకోవడానికి వీలు కలుగుతుంది. సూర్యుడి ఉపరితలంతో పోలిస్తే వెలుపలున్న కరోనాలో లక్షల డిగ్రీల సెల్సియస్ మేర అధికంగా ఉండటానికి కారణాన్ని కూడా ఈ వ్యోమనౌక ఛేదిస్తుందని అంచనా వేస్తున్నారు. పార్కర్ ప్రోబ్‌ను 1400 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతను తట్టుకొనేలా రూపొందించారు. అందుకోసం తెల్లటి పింగాణీ కవచాన్ని అమర్చారు. దాన్ని రీఇన్‌ఫోర్స్డ్ కార్బన్, కార్బన్ ఫోమ్‌తో తయారు చేశారు. వ్యోమనౌకలోని పరికరాలు కాలిపోకుండా శీతల వ్యవస్థను ఏర్పాటు చేశారు. అందువల్ల లోపల 29 డిగ్రీల సెల్సియస్ మేర మాత్రమే ఉష్ణోగ్రత ఉంటుంది. ఈ ప్రాజెక్టు వ్యయం 150 కోట్ల డాలర్లు.